
# రిగ్రెట్స్

— జి. నిర్మలారాణి

మనసంతా తేలిగ్గా, కొండంత బరువు తీరిపోయినట్టు ఎంతో రిలీఫ్‌గా వుంది. నిజం చెప్పాలంటే ఈమధ్యకాలంలో నన్నింతగా సంతోషపెట్టిన వార్త ఇంకొకటి లేదంటే అతిశయోక్తి కాదు. గుండెనిండుగా గాలి పీల్చుకున్నాను.



అంతలోనే ఆనందు, ఇంకా నలుగురైదుగురు మిత్రులు నన్ను చుట్టుకున్నారు.

రావడం రావడమే నన్ను గట్టిగా కౌగలించుకున్నాడు ఆనందు. "సారీరా, ఎక్స్‌ట్రీమ్లీ సారి" వాడి గొంతు వణికింది. వాడి కళ్ళు వర్షించడానికి సిద్ధంగా వున్నాయి. ఆనందూ, నేను ఒక ఊరివాళ్ళం. నాన్న టీచరు కావడంవల్ల చాలా సమయం మా ఇంట్లోనే గడిపే వాడు ట్యూషన్ అనీ, అదనీ, ఇదని. ఇప్పుడు ఇద్దరం మా ఊర్లోనే ఒకే కాలేజిలో లెక్చరర్లుగా పనిచేస్తున్నాం. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ తిరగడమేగానీ బాధపడడం అన్నది తెలియదు వాడికి. అటువంటివాడు

"ఇలాంటి సమయంలోనే ధైర్యం తెచ్చుకోవాలి సార్" వాడిపోయిన ముఖాలతో, సీరియస్‌గా భుజం తడుతున్నారు కాస్తో కూస్తో పరిచయం వున్నవాళ్ళు.

"నే వెళ్ళి చీఫ్ దగ్గర పర్మిషన్ తీసుకువస్తా. నువ్ రెడీకా" పరుగు తీశాడు ఆనందు.

మాటలు మర్చిపోయినట్టుగా గదిలో చిందర వందరగా వున్న నా వస్తువుల్ని బాగ్‌లో సర్దుతున్నారు మిగతా ఇద్దరు ముగ్గురు మిత్రులూ.

వీళ్ళ ధోరణీ, ఈ నిశ్శబ్దమూ చూస్తుంటే జరగరానిదేదో జరిగిందనే అనుమానం కలిగింది. అప్రయత్నంగా నా కుడిచేయి గుండెను తడిమింది. జేబులో నుండి కాగితం ముక్కను బయటకు లాగాను.

"ఫాదర్ ఎక్స్‌పైర్డ్. స్టార్ట్ ఇమ్మీడియెట్లీ"

టెలిగ్రాంలోని అక్షరాలు ఒకొక్కటే నా మనసుమీద ముద్రపడుతున్నాయి. నా గుండెచప్పుడు మళ్ళీ, మళ్ళీ ఆ అక్షరాల్ని పలుకుతున్నట్టుగా వుంది. క్రమక్రమంగా నిజాన్ని జీర్ణించుకోసాగింది మనసు. అంతవరకు వున్న ప్రశాంతత లాంటిదేదో మంచులాగ చెదరిపోయింది. ఏదో తెలియని అలజడి – గందరగోళం – ఆ తర్వాత నాన్నకోసం మొట్ట మొదటిసారిగా ఆక్రోశం మొదలయింది. టెలిగ్రాం చదివిన వెంటనే నాకు కలిగిన 'పిశాచం' లాంటి ఆనందానికి సిగ్గుతో నన్ను నేను తిట్టుకున్నాను, శపించుకున్నాను. నాకంటే నీచుడు ద్రోహుడు, ఇంకొకడు లేడని గట్టిగా చెంపలు వాయించుకున్నాను. పాలుతాగిన రొమ్మునే గుద్దడం అంటే ఇదేకదా అని విలపించాను. నాకు ఊహ తెలియక ముందే అమ్మ పోయింది. అప్పటినుండీ నాన్నే నా సర్వస్వం. లక్ష్మి నా జీవితంలోకి అడుగుపెట్టకముందు వరకు నా భోజనం, పడక కూడా నాన్నతోనే. అటువంటి నాన్న లేడంటే ... ... పదునైన ఆయుధంతో గుండెను ఛేదిస్తున్నట్టుగా వుంది. నాకు తెలియకుండానే

నా చెంపలమీద నీరు ప్రవహించడం మొదలయింది.

"ఛ ఛ, ఏమిట్రా ఇదీ? లే లే బస్‌కి టైం అయింది" కళ్ళు తుడిచి, బాగ్ అందుకున్నాడు ఆనందు. వాడిని చూడగానే నన్ను నేను నిగ్రహించుకోవడం సాధ్యంకాలేదు.

"అందరమూ ఎప్పుడో ఒకప్పుడు పోవాల్సినవాళ్ళమే ..." నా దుఃఖం చూసి వాళ్ళ గొంతులు పూడిపోయాయి. మౌనంగా భుజంతట్టి లేపారు మిత్రులు.

కలలో నడుస్తున్నట్టుగా ప్లాట్‌వాల్యుయేషన్ సెంటర్ నుంచి బయటపడ్డాను.

* * *

గుండె ఆగినంతపనయింది గదిలోపలి దృశ్యానికి.

ఆఫీసుకని బయలుదేరిన లక్ష్మి, కాలేజికి రెడీ అయిన నేనూ అవాక్కయి ఆగిపోయాం.

మలమూత్రాలలో మునిగివుందో మానవాకారం మంచంమీద. ఆ ఆకారం ఎవరిదో కాదు. ఐదు సంవత్సరాల క్రితం పక్షవాతంతో కాలూ చెయ్యితో పాటు నోరు కూడా పడిపోయి మంచాన్ని ఆశ్రయించిన నాన్నది. మనిషి వున్నాడన్నమాటేగాని మన లోకంలో వుండడు. భోజనం మొదలు అన్నీ లక్ష్మి చూడవలసిందే. దుప్పట్లు, గలీబులు అన్నీ ఖరాబుచేసి ప్రస్తుతం గోడకు నామాలు పెట్టే ప్రయత్నంలో వున్నాడు నాన్న.

గదిలోని దుర్గంధానికి డోకురాబోయింది.

"ఇప్పుడెట్లా" కళ్ళనీళ్ళొక్కటే తక్కువయింది లక్ష్మికి.

"ఎట్లా ఏముంది? అంతా మన ఖర్మ. ఈ ముసిలాయన పీడ మనకు చుట్టుకుంది. పర్మిషన్ రాసివ్వు ఆఫీసులో పడేసివస్తా" చేతిలోని ఫైలు కుర్చీలోకి గిరాటేశాను. కనబడ్డ వస్తువులన్నీ విరగగొట్టాలన్నంత కోపంగా వుంది.

"రోజూ పర్మిషన్లేనా అని ఆఫీసరు గొడవపెడుతున్నాడు. నేనీ ఉద్యోగం చెయ్యలేను బాబూ" లక్ష్మి గొణుగుతోంది.

"ఏదో ఒకటి ఏడువు ముందు, సతాయించకుండా. పనికిమాలిన బ్రతుకయిపోయింది. ఈ ముసిలాడు చావనూ చావడు, నన్ను బ్రతకనూ బ్రతకనివ్వడు" గట్టిగా అరిచాను.

లక్ష్మి లీవులెటర్ నా చేతిలో పెట్టింది. లక్ష్మి లీవు పెడుతోందని తెలిసి, నాన్నను చూసుకోడానికని పెట్టిన పిల్ల నెమ్మదిగా జారుకుంది.

"ఇంక మనవల్ల కాదు, మా చిన్నన్న దగ్గర వదిలేసివస్తా" అన్నాను.

"వాళ్ళకసలే చిన్నపిల్లలు. ఆ రొంపిలో ఆయన ఎట్లా వుంటాడు. అసలే నోరులేనిమనిషి! వద్దులెండి" అంది.

లక్ష్మి ఎప్పుడూ అంతే. తను మంచిదాన్ని అనిపించుకోవాలని తాపత్రయం. మొన్నటికి మొన్న నెలతప్పిందని తెలిసిన రోజున "ఇప్పుడు పిల్లలయితే ఎట్లాగండీ? మామగారు ఏమైపోతారు?" అంటూ ఎంతచెప్పినా వినకుండా అబార్షన్ చేయించుకుంది.

మంచితనానికీ ఒక హద్దు వుండాలికదా.

పెళ్ళయిన మరుక్షణమే "నాన్న నిన్ను విడిచి వుండలేడురా" అంటూ తెలివిగా నాన్న బాధ్యతను నాకు అంటగట్టారు ఇద్దరన్నలూ. అంతే, పెళ్ళై రెండు సంవత్సరాలవుతున్నా ఒక అచ్చటా లేదు, ముచ్చటా లేదు. నాతోపాటుగా పెళ్ళైన మిత్రులంతా హనీమూన్లని, పిక్నిక్కులని తిరుగుతుంటే తను – ఇదిగో ఇట్లా. ఛీ ఛీ ఈయన మంచంకి పడి అందరితో చేయించుకుంటూ బ్రతకకపోతేనేం? ఇంక తనకెప్పుడు విముక్తి. ఈ ముసిలాడు ఎప్పుడు చస్తాడో, ఎప్పుడు చస్తాడో ...!

ఒక్క కుదుపుతో బస్ ఆగింది. ఉలిక్కిపడి గతం నుండి తేరుకున్నాను.

ఇల్లు ఎట్లా వచ్చి చేరానో "బాబాయ్ వచ్చాడు, బాబాయ్ వచ్చాడు" అంటూ పిల్లలు చుట్టేశారు. అందర్నీ విడిపించుకుని అడుగు వెయ్యబోతుంటే ఎదురుగా అన్నలు, వదినలు, లక్ష్మి – వాళ్ళందరికీ వెనక వీల్ చెయిర్‌లో నాన్న!?!

"నాన్న అందర్నీ భయపెట్టేశాడురా. చచ్చి బ్రతికాడనుకో" పెద్దన్న.

"డాక్టర్ పెదవి విరిచేస్తే అయిపోయిందని నీకు టెలిగ్రాం ఇచ్చాం. నిజంగా మనం అదృష్టవంతులం. నాన్నను దక్కించుకున్నాం" చిన్నన్న.

"లక్ష్మి రాత్రింబవళ్ళు చూసుకోబట్టిగాని లేకుంటే దక్కేవాడా?" వదినెల సర్టిఫికెట్‌తో వికసించింది లక్ష్మి ముఖం.

అందరి ముఖాల్లోను సంతోషం. అందరూ తృప్తిగా, రిలీఫ్‌గా నవ్వుతున్నారు – లక్ష్మితో సహా.

నేనే కుర్చీలో కూలబడి భోరున ఏడ్చాను, ఏడుస్తూనే వున్నాను.

## అసలు కారణం ఇదీ!

విజయావారి 'మిస్సమ్మ' చిత్రం నుండి శ్రీమతి భానుమతిగారు ఎందుకు, మధ్యలో విరమించుకున్నారో నే విన్నది చెబుతాను. వరలక్ష్మీవ్రతం రోజున షూటింగ్ పడింది. శ్రీమతి భానుమతి గారు పరమఛాందసురాలు. యధా విధిగా ఏకాగ్రతతో పూజ ముగించుకుని కారులో స్టూడియోకి వెళ్ళారు (చాలా ??) ఆలస్యంగా. అప్పటికే చక్రపాణిగారు కాలుకాలిన పిల్లిలా చిందులు తొక్కుతూ వీరభద్రావతారం ఎత్తారు. కారు దిగిన శ్రీమతి భానుమతిగారు ఆలస్యానికి కారణం వివరించే లోపలే శ్రీ చక్రపాణిగారు నోరు చేసుకున్నారు. అంతే శ్రీమతి భానుమతి గారు అదే కారులో తిరిగి ఇంటికి వెళ్ళిపోయారు. ఇద్దరూ ప్రతిభావంతులే. శ్రీమతి భానుమతిగారికి ఏం. నష్టం కలగలేదుకాని (ఇప్పటికీ ఆమెను మించిన నటి లేనేలేదు) సావిత్రిగారిదే లాభమంతా!

– ఓ.ఆర్.కె. రావ్ మద్రాస్

